# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 30, మే 2026


## జూనియర్ కళాశాల తరగతులు వెంటనే ప్రారంభించాలి

2లో.

● టిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ధర్నా

- తాండూర్, మే 29, ప్రభాతవార్త :



# భీం కలలు కన్న స్వరాజ్యం దగ్గరలో ఉంది...

✪ ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ అందరి బాధ్యత

✪ కుమురం భీమ్ త్యాగం దేశానికి స్ఫూర్తి

✪ రౌటసంకేపల్లి గ్రామోత్సవం 2026లో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

ఆసిఫాబాద్, మే 29, ప్రభాతవార్త :

కుమురం భీం కలలు కన్న స్వరాజ్యం దగ్గరలో ఉందని, ఆయన చేసిన త్యాగం దేశానికి స్ఫూర్తియని, వారి ఆశయాలతో యువత ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్ల పేర్కొన్నారు. శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రౌట సంకెపల్లి గ్రామంలో నిర్వహించిన కుమురం భీమ్ జల్, జంగల్, జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం2026" కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ రౌట సంకెపల్లి కేవలం ఒక గ్రామం





మాత్రమే కాదని, ఆదివాసీ సమాజ వీరత్వం, త్యాగం, ఆత్మగౌరవం, సంస్కృతికి ప్రతీకగా నిలిచే పవిత్ర స్థలమని పేర్కొన్నారు. ఈ పవిత్ర ప్రాంతంలో జన్మించిన గొప్ప ఆదివాసీ విప్లవకారుడు, అమరవీరుడు కుమురం భీంకు కోటి ప్రణామాలు అర్పించారు. కుమురం భీమ్ ఇచ్చిన చారిత్రాత్మక నినాదం "జల్, జంగల్, జమీన్" (నీరు, అడవి, భూమి) యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ ఇది ప్రకృతి, మానవుల సహజీవనానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఖిజల్‌జంగల్‌జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవంఖి అనేది కేవలం ఒక సాంప్రదాయ కార్యక్రమం మాత్రమే కాదని, ఇది ఆదివాసీల గౌరవానికి, ఆత్మగౌరవానికి, వారి చారిత్రాత్మక పోరాటానికి ప్రతీక అన్నారు. దీని ద్వారా గ్రామాల సమగ్ర అభివృద్ధి, సాంప్రదాయ విద్య, ఆరోగ్యం, సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నారన్నారు. ఈ సభకు భారీ సంఖ్యలో హాజరైన మహిళలను అభినందించారు. ఏ సమాజానికైనా నిజమైన శక్తి మహిళలేనని, మహిళలు సాధికారత, విద్య, గౌరవాన్ని పొందినప్పుడే ఏ సమాజమైనా, దేశమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆధునిక యుగంలో యువత తమ మూలాలను, సంపన్న చరిత్రను, మహానుభావుల పోరాటాలను మరువకూడదని మిగతా 2లో..

## మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

* మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, మే 29, ప్రభాతవార్త

మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా 99 రోజుల కార్యాచరణలో మహిళా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో



గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండల సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల మిగతా 2లో..

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ

## పకడ్బందీగా చేపట్టాలి

★ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి



నిర్మల్, మే 29, ప్రభాతవార్త:

ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, మిగతా 2లో..

## జూనియర్ కళాశాల తరగతులు వెంటనే ప్రారంభించాలి

**తాండూర్, మే 29, ప్రభాతవార్త :**

తాండూర్ మండలానికి మంజూరైనా ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు వెంటనే ప్రారంభించాలని బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ డిమాండ్ చేశారు. తాండూర్ మండలంలోని ఐబి లో జాతీయ రహదారిపై శుక్రవారం బి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ మాట్లాడుతూ బెల్లంపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాల్లో జూనియర్ కళాశాలలు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం హంగు ఆర్భాటాలతో తాండూర్ మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేసిన కూడా నేటి వరకు తరగతులు ప్రారంభం లేదని విమర్శించారుకళాశాల మంజూరు కేవలం పేపర్లకు పరిమితమైందని, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ నిరక్ష్యంతో తరగతులు ప్రారంభానికి నోచుకోవడం లేదని ఆరోపించారు.తాండూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక పదో తరగతి చదివిన విద్యార్థులు సుమారుగా 200 నుండి 300 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుకోలేక మధ్యలో మానేస్తున్నారని అన్నారు. ఇప్పటికైన స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ జూనియర్ కళాశాల తరగతులు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు.లేని పక్షంలో బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు రహదారిపై నుంచి బలవంతంగా తొలగించారు. కార్యక్రమంలో నాయకులు సూర్య, సుమంత్, రాకేష్, రిజవాన్, వెంకటేష్, చోదన్, సారయ్య, ప్రశాంత్, సాయి, అక్రమ్, జుబైర్, సాహెల్, జాడి పోశం, ముబీన్, రమేష్, హర్ష వర్ధన్, సాయి ప్రసాద్, గంధం క్రిష్ణ, కుమార్, ఫెరోజ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ
# పకడ్బందీగా చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్–2026 పురోగతిపై సమీక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు కృషి చేయాలని స్పష్టం చేశారు.బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారమ్‌లను పంపిణీ చేసి, పూర్తి చేసిన వివరాలను సేకరించాలన్నారు. ఓటర్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎలక్షన్ కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లోనే తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. సూపర్‌వైజర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పాల్గొన్నారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, ఏఈఆర్వోలు (అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు), ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సులభ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: ఎండి జాఫర్

**మందమర్రి, మే 29, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియా సింగరేణి జిఎం కార్యాలయంలో ఐఎఫ్‌టియు బెల్లంపల్లి రీజనల్ అధ్యక్షుడు ఎండి జాఫర్ సులబ్ కార్మికులతో కలిసి కార్యాలయంలోని సివిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సంఘోజు శ్రీధర్‌కు తమ సమస్యను పరిష్కారాయించాలంటు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ సింగరేణి ప్రాంతమైన మందమర్రి, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి ప్రాంతాల్లో కార్మికుల అవసరార్థం నిర్మించిన సులబ్ కాంప్లెక్స్‌లను ఇంటర్నేషనల్ సులబ్ సంస్థకు అప్పగించి, స్థానిక కార్మికులతో నిర్వహిస్తున్నప్పటికీ, కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సులబ్ కాంప్లెక్స్‌లలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గత కొన్ని నెలలుగా జీతాలు సకాలంలో అందడం లేదని వారు ఆరోపించారు. ముఖ్యంగా మార్చి నెల నుంచి ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదని తెలిపారు. అంతేకాకుండా, స్థానిక సూపర్‌వైజర్లు జీతాల్లో కోతలు విధిస్తున్నారని కార్మికులు వాపోయారు. సింగరేణి యాజమాన్యం జి.ఓ ప్రకారం పూర్తి జీతాలు చెల్లిస్తున్నప్పటికీ, తమకు మాత్రం పూర్తి స్థాయిలో అందడం లేదని పేర్కొన్నారు. గత 30 సంవత్సరాలుగా సులబ్ కాంప్లెక్స్‌లలో పని చేస్తున్న కార్మికులు ప్రతిరోజూ ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్, యాసిడ్ వంటి రసాయనాల మధ్య పనిచేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నట్లు తెలిపారు. అయినప్పటికీ తమకు సరైన వైద్య సదుపాయాలు, సి.ఎం.పి.టి వంటి సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి, పెండింగ్ జీతాలు చెల్లించడంతో పాటు వైద్య సదుపాయాలు, భద్రతా పరికరాలు, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, సింగరేణి యాజమాన్యాన్ని వారు కోరారు.

# భీం కలలు కన్న స్వరాజ్యం దగ్గరలో ఉంది...

(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. జీవితంలో విజయానికి ఎటువంటి షార్ట్‌కట్లు లేవని, విద్య, క్రమశిక్షణ, కష్టపడే తత్వం, సేవాభావమే ముందుకు సాగే మార్గాలని తెలిపారు. మద్యపానంపై గ్రామస్తులు చేసిన ప్రతిజ్ఞను అభినందించారు.“వ్యసనాలకు బానిసలైతే మనం నాశనమవుతాం, వ్యసనాలకు దూరంగా ఉంటే మనం బాగుపడతాం“ అనే సందేశాన్ని ఆయన పునరుద్ఘాటించారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, భారత ప్రభుత్వం నిరంతరం చూపిస్తున్న నిబద్ధతను ప్రస్తావించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సమాజంలోని చివరి వ్యక్తి వరకు చేరుతోందని అన్నారు. గ్రామోత్సవం నిర్వహించిన నిర్వాహక కమిటీ సభ్యులను, సామాజిక సేవకులను గవర్నర్ అభినందించారు. ప్రకృతిని పరిరక్షిస్తూ, సంస్కృతిని కాపాడుతూ, సమానాభివృద్ధి కలిగిన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రౌటా సంకెపల్లి గ్రామం భవిష్యత్తులో ఆదర్శ ఆదివాసీ అభివృద్ధి, సామాజిక చైతన్యానికి కేంద్రంగా నిలుస్తుందనే విశ్వాసాన్ని గవర్నర్ వ్యక్తం చేశారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఆత్మ గౌరవ పోరాటానికి పునాది వేసిన పోరాట యోధుడు కొమురం భీం అని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యమానికి రాష్ట్ర గవర్నర్ రావడం సంతోషకరంగా ఉందన్నారు. భీం జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం నిజాం నిరంకుశ పాలనపై పోరాటం చేశారని గుర్తుచేశారు. అనంతరం గవర్నర్ గిరిజన కుటుంబాలకు సౌర విద్యుత్తు పలకాలను, బట్టలు, చీరలు పంపిణీ చేశారు. అంతకుముందు గవర్నర్ కొమరం భీం, ఎడ్లకొండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొమురం భీం కాంస్య విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, వెంకటరమణ, వెడ్మ బొజ్జు, పాల్వాయి హరీష్ బాబు, జిల్లా కలెక్టర్ కె. హరిత, ఎస్పీ నితికా పంత్, నిర్వాహకులు రాయపూడి నాగేంద్ర, ఆశలత పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, అధికారులతో కలిసి స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ రుణ సదుపాయాల ద్వారా వివిధ వ్యాపారాలలో మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. బ్యాంకు లింకేజీ, ఎన్.ఆర్.ఎల్.ఎం., ప్యాడీ కమిషన్, పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. పథకాలలో హాజీపూర్ మండలంలో 382 యూనిట్లకు గాను 18 కోట్ల 7 లక్షల రూపాయలు, దండేపల్లి మండలంలో 316 యూనిట్లకు గాను 16 కోట్ల 79 లక్షల రూపాయలు, లక్షెట్టిపేట మండలంలో 512 యూనిట్లకు వారం 18 కోట్ల 23 లక్షల రూపాయలు, మొత్తంగా 1 వేయి 210 స్వయం సహాయక సంఘాలకు 53 కోట్ల 10లక్షల 75 వేల రూపాయలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.

మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి ద్వారా లబ్ధి పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు, వారు ఆర్జించిన లాభాల నుంచి కొంత శాతం సంఘాల ఖాతాలలో పొదుపు చేయాలని, ప్రతి ఒక్కరికి సమాన లాభం చేకూర్చడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందని, కమిటీ సభ్యులు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలని, పిల్లలు హాజరు శాతం పెంచాలని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి అవకతవకులకు తావు లేకుండా చూడాలని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా వేగవంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం రాష్ట్రంలోని మొదటగా పూర్తయిందని, ఈ అవకాశాన్ని సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ గవర్నర్‌కు స్వాగతం పలికిన బిజెపి నాయకులు

**తాండూర్, మే 29, ప్రభాతవార్త :**

తాండూర్ మండలానికి వచ్చిన హర్యానా మాజీ గవర్నర్, బిజెపి సీనియర్ నేత బండారు దత్తాత్రేయకు శుక్రవారం బిజెపి పార్టీ నాయకులుఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బిజెపి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే అమ్మ రాజుల శ్రీదేవి ఎఫ్సీఐ బోర్డు మెంబర్ పులగం తిరుపతి, సీనియర్ నాయకులు చిలువరి శేషగిరి, పుట్ట కుమార్, పట్టి కృష్ణ, వైద్య శ్రీధర్, రాచర్ల సంతోష్, సుధీర్ గౌడ్, ఏమూర్ల ప్రదీప్, విజయ్, చిరంజీవి, రవి, అడువాల సతీష్ వేమూర్ల ప్రవీణ్, కామెర రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక నిధుల కోసం ముఖ్యమంత్రికి చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు విజ్ఞప్తి

**బెల్లంపల్లి, మే 29, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కీలక ముందడుగు పడింది. బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి నాయకత్వంలో, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి, పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను వినిపించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం ఉన్న సమస్యలను, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సమగ్రంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు అభివృద్ధి చెందకపోవడం వల్ల రోడ్ల దుస్థితి, కాలువల లోపం, తాగునీటి కొరత, పారిశుధ్య సమస్యలు వంటి అనేక సమస్యలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయని వివరించారు. ప్రత్యేకంగా క్రింది అంశాలపై దృష్టి సారిస్తూ నిధులు కేటాయించాలని కోరారు. పట్టణంలోని ప్రధాన, అంతర్గత రోడ్ల విస్తరణ మరియు సిమెంట్ రోడ్ల నిర్మాణం, కాలువల నిర్మాణం మరియు పాత డ్రైనేజ్ వ్యవస్థ పునరుద్ధరణ, తాగునీటి సరఫరా మెరుగుదల కోసం కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు, పట్టణ పారిశుధ్యాన్ని బలోపేతం చేయడానికి ఆధునిక సదుపాయాల కల్పన, వీధి దీపాల ఏర్పాటు, మరమ్మత్తులు, పట్టణ సౌందర్యవృద్ధి కార్యక్రమాలు, పేద ప్రజల నివాస ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి అలాగే, బెల్లంపల్లి పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని ముఖ్యమంత్రికి సమర్పించారు. భవిష్యత్‌లో పట్టణాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ ప్రతిపాదనలను శ్రద్ధగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, బెల్లంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, సంబంధిత శాఖలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ భేటీతో బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని, త్వరలోనే అభివృద్ధి పనులు వేగం అందుకుంటాయని స్థానిక ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రజాప్రతినిధులు తీసుకుంటున్న ఈ చర్యలను పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమం బెల్లంపల్లి పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపే కీలక ఘట్టంగా నిలవనుంది.

# వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




నస్పూర్, మే 29, ప్రభాతవార్త

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించేలా చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డిసిపి భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌లతో కలిసి పోలీస్, రవాణా, జాతీయ రహదారులు, రోడ్లు భవనాలు, ఆర్‌టిసి, విద్యుత్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాహ్ వీర్ కార్యక్రమంలో భాగంగా జాతీయ రహదారుల పైన ప్రమాదానికి గురైన క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకురావడానికి ఎవరైతే ముందుకు వస్తారో వారికి ప్రభుత్వం ద్వారా పారితోషకం అందించడం జరుగుతుందని, అదే విధంగా జిల్లాలో రహత్ కార్యక్రమంలో భాగంగా 4 ప్రభుత్వ ఆసుపత్రులు, జిల్లా ప్రభుత్వాసుపత్రి, చెన్నూర్, బెల్లంపల్లి, లక్సెట్టిపేట సామాజిక ఆరోగ్య కేంద్రాలు, మెడిలైఫ్, టచ్, అభయ, ఆరోగ్యశ్రీ ప్రైవేటు ఆసుపత్రులలో జాతీయ రహదారుల పైన ప్రమాదానికి గురైన క్షతగాత్రులకు ఉచితంగా వైద్య సదుపాయాలు అందించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని రోడ్లపై చెత్త, ఆటంకాలను వెంటనే తొలగించాలని, ట్రాఫిక్ పోలీసు విభాగం రోడ్లపై అనధికార వాహన నిలుపుదల, నిబంధనల ఉల్లంఘన పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లపై తక్కువ ఎత్తు గల బీమ్‌లు, తక్కువ విజిబిలిటీ ఉన్న చోట్ల లైటింగ్ ఏర్పాటు చేయాలని, జాతీయ రహదారులపై రంబుల్ స్ట్రిప్స్, లైటింగ్, జాగ్రత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్లపై అదుపు తప్పిన, ఓవర్ లోడెడ్ వాహనాలు, పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ పోలీసు అధికారులు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరి చేయడంలో కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో రోడ్డు భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాలలో అంతర్గత రహదారులలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, రహదారులపై కేజ్ వీల్స్, ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగాన్ని నిలిపివేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా వేగ పరిమితి బోర్డులు, హెచ్చరిక బోర్డులు, జాగ్రత్త సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రహదారులపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేయాలని, ప్రతి మండల, గ్రామాల పరిధిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో పట్టుబడిన వారి లైసెన్సులు రద్దు చేయాలని, వారి వివరాలు, పరిమితికి మించి లోడింగ్ చేసి తనిఖీలలో పట్టుబడిన వాహనాల వివరాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. రహదారులపై సంచరించే పశువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించాలని తెలిపారు. అంతర్గత రహదారులలో కల్వర్టుల దగ్గర సూచికలు ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల బెడదను నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓవర్ లోడింగ్, మితిమీరిన వేగం, డ్రంక్ అండ్ డ్రైవింగ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రహదారి ప్రమాదాలు, మరణాలు తగ్గించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శి సునీల్ రెడ్డిని శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేస్తున్న సర్పంచ్ సాయన్న

## బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శికి ఘన సన్మానం

బజార్‌హత్నూర్, మే 29, ప్రభాతవార్త:

బజార్‌హత్నూర్ గ్రామ పంచాయతీలో మూడు సంవత్సరాల తొమ్మిది నెలల పాటు బాధ్యతలు నిర్వర్తించి, బదిలీపై వెళ్తున్న పంచాయతీ కార్యదర్శి (సెక్రటరీ) సునీల్ రెడ్డికి సర్పంచ్, గ్రామ ప్రజలు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయన బజార్‌హత్నూర్‌లో పనిచేసిన కాలంలో ప్రజా సమస్యలను నేరుగా పర్యవేక్షిస్తూ, గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా గ్రామస్థులు కొనియాడారు. బదిలీపై జైనథ్ మండలానికి వెళ్తున్న ఆయనను సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయన్న, ఉపసర్పంచ్ శారద రాజన్న, చట్ల వినీల్, డుబ్బుల చంద్రశేఖర్, ప్రభాకర్, అర్జున్, చట్ల తరుణ్ సురేష్, బత్తిని మురళీకృష్ణ, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

## జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

భైంసా, మే 29, ప్రభాతవార్త:

రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు జొన్నలు విక్రయించి నష్టపోవద్దని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. భైంసా పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్, చైతన్య మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రంతో పాటు, కుబీర్ మండల కేంద్రంలో కుబీర్ మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు క్వింటాల్‌కు రూ.3,699 కనీస మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. రైతులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు తమ పంటను తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు పారదర్శకంగా చెల్లింపులు జరుగుతాయని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చెందొద్దు, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది

**- ఎమ్మెల్యే అనిల్ జాదవ్**



రైతులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 29, ప్రభాతవార్త:

రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని, బీఆర్ఎస్ పార్టీ తరపున రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భరోసా ఇచ్చారు. నేరడిగొండ మండల కేంద్రంలో గల జొన్న, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను (జిన్నింగ్ ఫ్యాక్టరీ) శుక్రవారం ఆయన సందర్శించారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో పంటను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్న రైతులను కలిసి మాట్లాడి, వారికి ధైర్యం చెప్పారు. కేంద్రాల్లో ధాన్యం రవాణాకు లారీలు లేక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, తక్షణమే 10 లారీలు వచ్చేలా లారీ యజమానులతో మాట్లాడి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ రైతులు అధైర్యపడొద్దని, కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతి రైతు కోసం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రైతు బంధు సకాలంలో ఇవ్వకపోగా, ఎంతో కష్టపడి పండించిన పంటలు వర్షం పాలు అవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ చిత్రు, స్థానిక ఎంపీడీఓ, సర్పంచ్ నీలిమ రవీందర్, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, శివారెడ్డి, ప్రతాప్, సుజీల్, స్వామి, శ్రీధర్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న నేతాజీ నగర్ శివప్రసాద్

భైంసా, మే 29, ప్రభాతవార్త:

చిన్న వయసులోనే గొప్ప ఆశయంతో ఒకవైపు కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, మరోవైపు సమయం దొరికినప్పుడల్లా సమాజ సేవలో భాగస్వామి అవుతున్నాడు నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని నేతాజీ నగర్‌కు చెందిన శివప్రసాద్. సమాజంలో ఎవరైనా రక్తం దొరక్క ఇబ్బంది పడితే, రక్తం పంచుకుని పుట్టకపోయినా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తాన్ని అందించి తోడుగా నిలుస్తున్నాడు. ఎలాంటి స్వప్రయోజనం ఆశించకుండా తోటివారికి సాయం చేయాలన్న మహోన్నత ఆశయంతో ఆయన నిరంతరం రక్తదానం చేస్తున్నాడు. ఇతని స్ఫూర్తి ఎంతోమందికి ఊపిరి పోయడమే కాకుండా, మరికొందరిని రక్తదాతలుగా తీర్చిదిద్దుతోంది.తాజాగా భైంసాలోని శ్రీ సాయి మెటర్నిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పూజ అనే మహిళకు అత్యవసరంగా ఎబి పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయం తెలుసుకున్న శివప్రసాద్ వెంటనే స్పందించి ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. సమయానికి స్పందించి ప్రాణాలు కాపాడిన రక్తదాతకు బాధిత కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన సింగరేణి కార్మికుడు భాస్కర్

**- కీబోర్డు అద్భుతంగా వాయించినందుకు గాను ఘనత - చిన్నప్పటినుంచి కీబోర్డుపై ఆసక్తి**

**- ప్రస్తుతం సింగరేణి శాంతిఖని గనిలో ఎలక్ట్రీషియన్‌గా విధుల నిర్వహణ**

**బెల్లంపల్లి, మే 29, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని నెంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన సింగరేణి కార్మికుడు, శాంతిఖని గనిలో ఎలక్ట్రీషియన్ గా విధులు నిర్వర్తిస్తున్న మంతెన భాస్కర్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. గత ఫిబ్రవరి 2న హైదరాబాద్లోని జొరాస్ట్రియన్ క్లబ్‌లో గిన్నిస్ బుక్ ప్రతినిధుల ఆధ్వర్యంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ సమన్వయంతో జరిగిన సంగీత కార్యక్రమంలో 22 దేశాల నుంచి సుమారు 2000 మంది కీబోర్డు సంగీత వాయిద్యకారులు ఏకకాలంలో ప్రదర్శన నిర్వహించారు. అందులో ప్రతిభ కనపరచిన కొంతమందిని గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎంపిక చేశారు. అందులో బెల్లంపల్లి పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు మంతెన భాస్కర్ గిన్నీస్ వరల్డ్ రికార్డు సాధించడం ఎంపికవ్వడం విశేషం. ఎంపిక అయిన మంతెన భాస్కర్ కు శుక్రవారం హైదరాబాదులోని గచ్చిబౌలిలో గల విక్టరీ ఆడిటోరియంలో జరిగిన గిన్నిస్ అచీవర్స్ మీట్ కార్యక్రమంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు అగస్టిన్ దండంగి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెడల్ అందజేశారు.



### కష్టాల్లోంచి కార్మికుడిగా... ఇష్టపడి కీబోర్డు ప్లేయర్‌గా ఎదిగిన మంతెన భాస్కర్.

బెల్లంపల్లి పట్టణంలోని నెంబర్ 2 ఇంక్లైన్ బస్తీకి చెందిన మంతెన రాజయ్య పోసమ్మ దంపతుల మూడవ సంతానమే మంతెన భాస్కర్. భాస్కర్ కు అన్న రమేష్, అక్క రమా, తమ్ముడు సంజీవ్ ఉన్నారు. భాస్కర్ కు పదేళ్ల వయసు ఉన్నప్పుడే 1996లో తండ్రి రాజయ్య శాంతిఖనిలో గని ప్రమాదంలో మృతి చెందారు. అప్పట్నుంచి తల్లి పోసమ్మే నలుగురు పిల్లలను ధైర్యంతో పెంచి పెద్ద చేస్తూ వచ్చింది. భాస్కర్ అన్న రమేష్ కు వారసత్వంగా తండ్రి ఉద్యోగం వచ్చింది. రమేష్ తన చెల్లెలు, ఇద్దరు తమ్ముళ్లకు తండ్రి స్థానంలో ఉండి తన వ్యక్తిగత జీవితాన్ని కూడా త్యాగం చేసి ఎన్నో కష్టాలు పడి చదివించాడు. ఎన్నో అవమానాలు ఆర్థిక ఇబ్బందులను దాటుకుంటూ రమేష్ తన తల్లి సహకారంతో చెల్లెల్ని తమ్ముళ్లను ఏ లోటూ లేకుండా చూసుకున్నారు. ఈ కష్టాల్ని, త్యాగాల్ని గమనిస్తూ పెరుగుతూ వచ్చిన భాస్కర్ బాగా చదువుకొని సింగరేణి సంస్థ 2018లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎలక్ట్రిషియన్‌గా ఉద్యోగం సాధించినాడు 2018లో శాంతిఖని గనిలో ఎలక్ట్రీషియన్‌గా విధుల్లో చేరారు. 2023లో సుప్రియను వివాహమాడారు. వీరికి కుమారుడు లియోనార్డో ఉన్నాడు.

### మంతెన భాస్కర్‌కు ప్రశంసల వెల్లువ..

గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించినందుకు కుటుంబసభ్యులు ఎంతగానో అభినంధించినారు ఆనందంలో కుటుంబసభ్యులు సంబారాలు చేసుకున్నారు. భాస్కర్ పనిచేస్తున్న సింగరేణి సమస్త ఉన్నత అదికారులు, శాంతిఖని గని అధికారులు, తోటి కార్మికులు, యూనియన్ నాయకులు, బంధువులు, మిత్రులు ప్రశంసించారు.

## నిర్మల్‌లో ఈ నెల 30న హెచ్‌సీఎల్ టెక్‌బీ మెగా ఉద్యోగ మేళా

**నిర్మల్, మే 29, ప్రభాతవార్త:**

హెచ్‌సీఎల్ టెక్ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. ఈ నెల 30వ తేదీ శనివారం ఉదయం 10:30 గంటలకు నిర్మల్ బస్ డిపో ఎదురుగా ఉన్న ఏఎంఐటి కంప్యూటర్స్ (మొదటి అంతస్తు, బిగ్‌సి పైన) ఈ ఉద్యోగ మేళా జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జాదవ్ పరశురాం, హెచ్‌సీఎల్ సంస్థ ఇన్‌ఛార్జ్ రాజుల రాజేష్ కుమార్ తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ కార్యక్రమం కింద సాఫ్ట్‌వేర్ రంగంలో డీపీఓ పోస్టుల భర్తీకి ఈ మేళా నిర్వహిస్తున్నారు. 2025 లేదా 2026లో సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్ గ్రూపులలో ఇంటర్ పూర్తిచేసి 750కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈ మేళాకు అర్హులు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులందరూ ఇందులో పాల్గొనవచ్చు. హాజరయ్యే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువపత్రం నకలు, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత లేదా ఆన్‌లైన్ ధ్రువపత్రం నకలు, గుర్తింపు కార్డు నకలు తీసుకురావాల్సి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు బిట్‌లాట్‌ఎల్‌వై/హెచ్‌సీఎల్‌టీబీతెలంగాణ అనే లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు హెచ్‌సీఎల్ ఏరియా ప్రతినిధి రాజుల రాజేష్ కుమార్‌ను ఎనిమిది సున్నా ఏడు నాలుగు సున్నా ఆరు ఐదు ఎనిమిది సున్నా మూడు, తొమ్మిది ఏడు సున్నా ఒకటి ఆరు ఆరు ఐదు నాలుగు రెండు నాలుగు నంబర్లలో సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.



## రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి

**హాజీపూర్, మే 29, ప్రభాతవార్త**



రైతులందరూ సేంద్రియ వ్యవసాయం వైపు ముగ్గు చూపాలని మంచిర్యాల వ్యవసాయ శాఖ ఏడిఏ కృష్ణ అన్నారు శుక్రవారం రోజున మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో నిర్వహించిన సహజ వ్యవసాయం, జాతీయ సహజ వ్యవసాయ మిషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ కృష్ణ మాట్లాడుతూ సహజ వ్యవసాయం పశుపోషణతో అనుసంధానమై ఉంటుంది. ఇందులో బీజామృతం, జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, దశపర్ణి వంటి పొలంలోనే తయారు చేసే ఇన్‌పుట్‌ల వినియోగం, బహుళ పంటల సాగు విధానాలు తెలియచేయడం జరిగింది. సహజ వ్యవసాయం అనేది రసాయన రహిత వ్యవసాయ విధానం. ఇందులో పశుపోషణ (ప్రధానంగా స్థానిక జాతి ఆవు)తో అనుసంధానమైన సహజ వ్యవసాయ పద్ధతులు, ఇది నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం, రైతులకు అవసరమయ్యే పెట్టుబడి ఖర్చులను తగ్గించడం ద్వారా వాతావరణ మార్పులకు తట్టుకునే సామర్థ్యాన్ని పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. సహజ వ్యవసాయం నేల, నీరు, సూక్ష్మజీవులు, మొక్కలు, జంతువులు, వాతావరణం, మానవ అవసరాల మధ్య ఉన్న పరస్పర ఆధారిత సంబంధాన్ని గుర్తిస్తుంది. సహజ వ్యవసాయ పద్ధతులు నేల నిర్మాణం, పోషకాలు, నేల సేంద్రియ కార్బన్‌ను మెరుగుపరుస్తాయి. తేమ నిల్వ సామర్థ్యం, నీటిని నిలుపుకునే సామర్థ్యాన్ని పెంచుతాయి. పంటల వైవిధ్యాన్ని ప్రోత్సహించి, పొలాల్లో జీవ వైవిధ్యాన్ని పెంచే సహజ ఆవాసాలను అభివృద్ధి చేస్తాయి. ఈ కార్యక్రమంలో హాజీపూర్ ఏ ఓ క్రిష్ణ, ఏ ఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

**నేరడిగొండ, మే 29, ప్రభాతవార్త:**

మండలంలోని కుమారి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో పంటల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులను కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వలకు ఎదురవుతున్న ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే, వెంటనే స్పందించి రైతుల పంటను డంపింగ్ చేయడానికి సాత్ నంబర్ లో గల విజయలక్ష్మి జిన్నింగ్ ఫ్యాక్టరీ యజమానితో మాట్లాడి ఆ జిన్నింగును కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిరక్ష్య వైఖరిని ఖండించారు. రైతులు ఎవరు కూడా అధైర్యపడొద్దని, బీఆర్ఎస్ పార్టీ తరపున అన్నదాతలకు అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట అడిషనల్ కలెక్టర్ చిత్రు, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, రవీందర్ రెడ్డి, ప్రతాప్, సుజీల్, స్వామి, శ్రీధర్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అవయవదానం, రక్తదానంపై ప్రతిజ్ఞ చేసి ఆదర్శంగా నిలిచిన పూర్వ విద్యార్థులు

**20 ఏళ్ల తర్వాత ఒకేచోట... గురువులకు ఘనంగా సన్మానించిన**

**మందమర్రి, మే 29, ప్రభాతవార్త**



ఇరవై ఏళ్ల క్రితం ఒకే తరగతి గదిలో కూర్చొని పాఠాలు విన్న విద్యార్థులంతా మళ్లీ ఒకేచోట కలుసుకుని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యతో పాటు విలువలు, సమాజం పట్ల బాధ్యతను నేర్పి జీవితంలో స్థిరపడేందుకు మార్గం చూపిన తమ గురువులను ఘనంగా సన్మానిస్తూ కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా సామాజిక బాధ్యతతో అవయవదానం, నేత్రదానం, రక్తదానం చేయాలని ప్రతిజ్ఞ చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. 2005-06 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో ఉన్న తమ పూర్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. విద్యార్థి దశలో జరిగిన సరదా సంఘటనలు, పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రామ్ వేణు, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, బాబ్జి, అంజద్, రాజేందర్, హకీమ్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకోవాలని నిర్ణయించడంతో పాటు, పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆటాపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ అలరించాయి.

## ప్రధానోపాధ్యాయునిపై విచారణ జరపాలి

**- డీఈఓకు పీఆర్‌టీయూ ఎస్ వినతి**

**భైంసా, మే 29, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని మదినా కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై వచ్చిన నిధుల దుర్వినియోగం ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పీఆర్‌టీయూ ఎస్ సంఘం నాయకులు కోరారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కార్యాలయంలో డీఈఓ దర్శనం భోజన్నను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బి.వి. రమణారావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలకు మంజూరైన స్కూల్ కాంప్లెక్స్ గ్రాంట్, స్కూల్ గ్రాంట్, స్కావెంజర్ల నిధులను నిబంధనలకు విరుద్ధంగా బ్యాంకు ఖాతా నుండి డ్రా చేసి దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే పాఠశాల పురాతన భవనాన్ని కూల్చివేసి, దానికి సంబంధించిన మిగులు సామాగ్రిని నిబంధనలకు విరుద్ధంగా విక్రయించి, ఆ నిధులను సైతం పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఈ అంశాలపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో సంఘం స్పందించి డీఈఓకు ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. నిష్పక్షపాతంగా వ్యవహరించే అధికారులను నియమించి విచారణ జరపాలని, సదరు ప్రధానోపాధ్యాయునిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని, పాఠశాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. దీనికి జిల్లా విద్యాశాఖ అధికారి సానుకూలంగా స్పందిస్తూ ఇద్దరు విచారణ అధికారులను నియమించి, నిష్పక్షపాతంగా విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భైంసా మండల అధ్యక్షుడు ఎస్. గంగాధర్, అసోసియేట్ అధ్యక్షుడు గులాబ్ దస్తగిరి ఖాన్, నిర్మల్ రూరల్ మండలాధ్యక్షుడు కొబ్బరి శంకర్, ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్, సోన్ మండల ప్రధాన కార్యదర్శి సాయికుమార్, నిర్మల్ అర్బన్ ప్రాథమిక సభ్యుడు భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**- 26 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేత**

**వేమనపల్లి, మే 29, ప్రభాతవార్త**



వేమనపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 26 మంది లబ్ధిదారులకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి పథకం చెక్కులను మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆర్. సంతోష్ కుమార్ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఖాళీక్, స్థానిక సర్పంచులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ద్వారా రూ.1,00,116 ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముల్కల్ల సత్యనారాయణ, సర్పంచులు చెన్నూరి సమ్మయ్య, కొట్రంగి శ్రీనివాస్, వుప్పలపు సాయి కృష్ణ, మడే శ్రీనివాస్, ఏనగంటి మల్లేశ్వరి శేఖర్ రెడ్డి, ముల్కల్ల శ్రీలత సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్‌లో ఎరువులు, విత్తనాల డీలర్లకు వ్యవసాయ శాఖ హెచ్చరిక

**- అధిక ధరలకు యూరియా విక్రయిస్తే లైసెన్స్ రద్దు - ఏడీఏ మనోహర్**





**కాగజ్‌నగర్ రూరల్, మే 29, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని ఎరువులు, విత్తనాల డీలర్లతో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) మనోహర్ మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు నిబంధనల ప్రకారం అందించాలని డీలర్లకు సూచించారు. యూరియాను నిర్ణీత ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత డీలర్ల లైసెన్సులను సస్పెండ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే రైతులు ముందస్తుగా యూరియా బుకింగ్ చేసుకుని వచ్చినట్లయితే వారికి తప్పనిసరిగా యూరియా అందించాలని, ఎలాంటి లింక్ ప్రొడక్ట్స్ లేదా ఇతర వస్తువులను బలవంతంగా కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు. రైతులను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయడం, ఎరువులు అందించకుండా ఆలస్యం చేయడం వంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. అదేవిధంగా అధిక ధరలకు యూరియా విక్రయించడం, నాసిరకం విత్తనాలు, పురుగుమందులను రైతులకు అంటగట్టడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

సమావేశం అనంతరం మండల వ్యవసాయ అధికారి (ఏఓ) రామకృష్ణ మాట్లాడుతూ, వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో నిబంధనలు పాటించని కొన్ని దుకాణాలకు "స్టాప్ సేల్" నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రతి దుకాణంలో ఎరువుల నిల్వల వివరాలు, విత్తనాల ధరల జాబితా, పురుగుమందుల ధరలు రైతులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని డీలర్లకు సూచించారు. రైతులకు పారదర్శకంగా సేవలు అందించి వ్యవసాయ శాఖ మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు) సృజన, శ్రీనివాస్, మండలంలోని ఎరువులు, విత్తనాల డీలర్లు పాల్గొన్నారు.

## 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్

**- మంచిర్యాల జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్**

**నస్పూర్, మే 29, ప్రభాతవార్త**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ ప్రాముఖ్యతతో పాటు, శిశువు జీవితంలోని మొదటి 1000 రోజుల కీలకతపై అవగాహన కల్పించడం జరిగిందని. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు, మేధో వికాసానికి ఈ కాలం అత్యంత ముఖ్యమని తెలిపారు. పోషకాహార లోప నిర్మూలన, పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేయాలని అంగన్‌వాడీ టీచర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్, తల్లి సంరక్షణ, పోషకాహారం, చిన్నారుల ఆరోగ్యంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అనంతరం కార్యక్రమం గోడప్రతులను ఆవిష్కరించి, అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రదర్శించేందుకు అందజేశారు. ఈ కార్యక్రమం మంచిర్యాల ప్రాజెక్టు అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.






## తాళ్ళగురిజాల పరిధిలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**- అదుపులోకి 9 మంది, రూ.1,28,240 నగదు**

**- 8 చరవాణిల స్వాధీనం**

**బెల్లంపల్లి, మే 29, ప్రభాతవార్త**

తాళ్ళగురిజాల పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమల హిల్స్ సమీపంలో ఉన్న ఆర్‌పీ గార్డెన్‌లో జరుగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంపై స్పందించిన అధికారులు, సిబ్బందితో కలిసి సాయంత్రం సమయంలో అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకున్నారు. అరెస్టు చేసిన వారిలో జె. క్రాంతి కుమార్, డి. శ్రీనివాస్, ఏ. పోశం, తొంగల వెంకటేష్, గొడిశాల మణిరాజ్, గాజు గంగాధర్, సింగతి రవి, సలేందర్ కేశవ్, ఎం.డి. హఫీజ్ ఉన్నారు. పోలీసులు వారి వద్ద నుండి మొత్తం రూ.1,28,240 నగదు, 104 పేక ముక్కలు, 8 చరవాణిలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ పేకాట వంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజలు ఇటువంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు.



## సింగరేణి ఉద్యోగుల సమస్యలపై విస్తృత సమీక్ష సమావేశం

**- ఏఐటియుసి యూనియన్‌తో 18వ స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహణ**

**మందమర్రి, మే 29, ప్రభాతవార్త**

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అధ్యక్షతన గుర్తింపు కార్మిక సంఘం (ఏ.ఐ.టి.యు.సి) యూనియన్‌తో 18వ స్ట్రక్చర్ సమావేశం శుక్రవారం రోజున మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం వేదికగా నిలిచింది. గుర్తింపు కార్మిక సంఘం నాయకులు మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, రామకృష్ణపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీతో పాటు ఇతర ఏఐటియుసి నాయకులు పాల్గొని ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలను జి.ఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మిక సంఘాల పాత్ర ఎంతో కీలకమని, సంస్థ అభివృద్ధి  కార్మికుల సంక్షేమం రెండూ పరస్పర ఆధారితమైనవని తెలిపారు. ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు మాత్రమే కాకుండా, ఉద్యోగుల భద్రత, సంక్షేమం, సౌకర్యాల పెంపు పట్ల సంస్థ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గతంలో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమగ్ర సమీక్ష నిర్వహించి, వాటి పురోగతిని అధికారులు వివరించారు. ఇంకా పరిష్కారం కాని సమస్యలపై చర్చించి, వాటిని వేగవంతంగా పరిష్కరించేందుకు సంబంధిత విభాగాధిపతులకు జిఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో కార్మికులు ప్రస్తావించిన ముఖ్య సమస్యలలో పని పరిస్థితులు, భద్రతా చర్యలు, మౌలిక వసతులు, వైద్య సదుపాయాలు, ఉద్యోగుల సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు ప్రాధాన్యత పొందాయి. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జి.ఎం అధికారులను ఆదేశించారు. అలాగే, సింగరేణి సంస్థ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో కార్మికులు ఇప్పటివరకు చూపిన సహకారం ప్రశంసనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో కూడా అదే నిబద్ధతతో పని చేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కార్మిక సంఘాల నాయకులను కోరారు. సమావేశం సానుకూల వాతావరణంలో సాగుతూ, పరస్పర చర్చల ద్వారా సమస్యలకు పరిష్కార మార్గాలను అన్వేషించడం జరిగింది. ఈ తరహా సమావేశాలు సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి దోహదపడతాయని జిఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కె.కె గ్రూప్ ఏజెంట్ రాంబాబు, డీజీఎం పర్సనల్ అశోక్, డీజీఎం ఐ.ఈ.డి కిరణ్ కుమార్, డీజీఎం వర్క్‌షాప్ (ఈ అండ్ ఎం) దూప్ సింగ్, డీవైపీఎం సందీప్, సివిల్ ఎస్.ఇ శ్రీధర్, ఏఐటియుసి జిఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సి.వి. రమణ, అలాగే ఇతర సీనియర్ అధికారులు, యూనియన్ నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**హాజీపూర్, మే 29, ప్రభాతవార్త**

ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంచిర్యాల డిపిఓ వెంకటేశ్వరరావు అన్నారు. పరిశుద్ధ కార్మికులు గ్రామాల్లో ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలను పరమ తప్పకుండా చేపట్టాలన్నారు శుక్రవారం రోజు మంచిర్యాల డిపిఓ వెంకటేశ్వరరావు. శుక్రవారం రోజున జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వరరావు హాజీపూర్ మండలంలోని పెద్దంపేట మరియు దొనబండ గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా సందర్శించారు. గ్రామాలలో నిర్వహిస్తున్న పారిశుద్ర కార్యక్రమం పరిశీలించి, ఎక్కడ కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని, రహదారులు మరియు మురుగు కాలువలు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించడం జరిగింది. జల్ సంచాయి  జల్ భగీదరి సర్వేను వేగవంతం చేసి పెద్ద గ్రామ పంచాయతీలో రోజుకు 200 చిన్న గ్రామపంచాయతీ, 100 స్ట్రక్చర్స్‌ను క్యాప్చర్ చేయాలని ఆదేశించారు. రిజిస్టర్లు మరియు రికార్డులు పరిశీలించి అన్ని రిజిస్టర్లు అప్డేట్ చేసి ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సుమన్, సర్పంచ్ జాడి వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు రూపాదేవి, పుదరి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.





మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

## మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### - డ్వాక్రా సంఘాలకు చెక్కులు పంపిణీ

**తాండూర్, మే 29, ప్రభాతవార్త :**

మహిళల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం మహిళ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 53 డ్వాక్రా సంఘాలకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా మంజూరైన రూ. 8 కోట్ల చెక్కును మండల అభ్యుదయ మహిళ సంఘం మహిళలకు ఎంపీడీవో అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ మహిళలు బ్యాంక్ రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఏపీఎం శ్యామల, మండల అభ్యుదయ మహిళ సంఘం అధ్యక్షురాలు చంద్రకళ, కార్యదర్శి నాగమణి, కోశాధికారి రాజ్య లక్షీ ్మ, సిసిలు, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి సన్మానం

**తాండూర్, మే 29, ప్రభాతవార్త :**

తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ద బోయిన శంకర్ ను శుక్రవారం అచ్చలాపూర్ లో స్థానిక సర్పంచ్ మరిశెట్టి స్రవంతి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బండి పోషం, నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, దాగం పాపయ్య, దాగం పోషయ్య, పుప్పాల తిరుపతి, పుప్పాల అనిల్, పొట్లపల్లి రెడ్డి, దుర్గం రామకృష్ణ, చిట్లా రమేష్, పుప్పాల రమేష్, జాడి శంకర్, ఆయిలీ శంకర్, వరిమడ్ల తిరుపతి, పెంటయ్య, సంతోష్, అభిరామ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 3న జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశం

### - జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య

**ఆసిఫాబాద్ టౌన్, మే 29, ప్రభాతవార్త :**

రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం కోసం జూన్ 20న నిర్వహించనున్న నేపథ్యంలో జాతీయ లోక్ అదాలత్ సమన్వయ సమావేశంను జూన్ 3న ఉదయం 11 గంటలకు బార్ అధ్యక్షులు, అసోసియేషన్ సభ్యులు, బీమా సంస్థల స్టాండింగ్ కౌన్సిల్ ప్రతినిధులతోను, సాయంత్రం 4 గంటలకు పోలీసు, ఆబ్కారీ, అటవీ శాఖల అధికారులతో జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థానం భవనంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యల కేసులు, వివాహం, కుటుంబ కలహాల కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద కేసులు, ఎన్ఐ యాక్ట్, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులతో పాటు ఇతర కాంపౌండబుల్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు అందరూ సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# వేసవి వేళ.. 'సింగరేణి' స్విమ్మింగ్ పూల్స్‌లో ఈత సరదా..

### ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం.. నామమాత్రపు రుసుముతో శిక్షణ

**నస్పూర్, మే 29, ప్రభాతవార్త**



ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్స్ కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో కళకళలాడుతున్నాయి. భానుడి భగభగలకు ఉపశమనంగా శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్స్ వేసవి విడిది కేంద్రాలుగా మారాయి. నస్పూర్ సీసీసీ టౌన్‌షిప్, బంగ్లా ఏరియాలోని పూల్స్ ప్రతిరోజూ వందలాది మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో సందడిగా కనిపిస్తున్నాయి. కేవలం వినోదం కోసమే కాకుండా, శారీరక దృఢత్వం కోసం ఈతను ఒక వ్యాయామంగా ఎంచుకుంటున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. సీసీసీ పూల్ 2004లో అప్పటి జీఎం ఏ. మనోహర్ రావు చేతుల మీదుగా ప్రారంభం కాగా, ప్రస్తుతం ఇక్కడ సుమారు 600 మంది శిక్షణ పొందుతున్నారు. సింగరేణి యాజమాన్యం తమ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా అత్యంత తక్కువ రుసుముతో ఈ సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఇక్కడ కేవలం ఈత నేర్చుకోవడమే కాకుండా, జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమయ్యేలా శిక్షణ కూడా లభిస్తోంది. స్విమ్మింగ్ పూల్ నీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేస్తూ, ఫిల్ట్రేషన్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేస్తున్నారు. దీనివల్ల చర్మ వ్యాధులు రాకుండా యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. చిన్నారుల కోసం ప్రత్యేకంగా తక్కువ లోతు ఉన్న పూల్స్ అందుబాటులో ఉన్నాయి. కేవలం ఈత నేర్పడమే కాకుండా, నీటిలో ఆపద సమయంలో ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో నేర్పిస్తున్నారు. సింగరేణిలో కఠినమైన పని ఒత్తిడిలో ఉండే కార్మికులకు, సాయంత్రం వేళ ఈత కొట్టడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని, ఇది వారి పనితీరును మెరుగుపరుస్తుందని నిపుణులు చెబుతున్నారు.



### నామమాత్రపు రుసుము.. అత్యుత్తమ శిక్షణ..

జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్స్‌లో నెలకు రూ. 2 వేల వరకు వసూలు చేస్తుండగా, సింగరేణి యాజమాన్యం కార్మికుల కోసం కేవలం రూ. 100, వారి పిల్లల కోసం రూ. 70 మాత్రమే వసూలు చేస్తోంది. ఈత నేర్చుకోవాలనుకునే వారు గని సంక్షేమ అధికారి ధ్రువీకరణ, మెడికల్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుండి 8 గంటల వరకు ఈ స్విమ్మింగ్ పూల్స్ అందుబాటులో ఉంటున్నాయి. ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్స్ వేలల్లో వసూలు చేస్తున్న తరుణంలో, సింగరేణి అందిస్తున్న ఈ సేవలు కార్మిక వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

### కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం

**- మునిగంటి శ్రీనివాస్, శ్రీరాంపూర్ జీఎం**



సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల మానసిక ఉల్లాసం, ఆరోగ్యం కోసం యాజమాన్యం ఈ స్విమ్మింగ్ పూల్స్‌ను నిర్వహిస్తోంది. వలం వినోదం మాత్రమే కాకుండా, క్రమశిక్షణతో కూడిన వ్యాయామం ఇక్కడ లభిస్తుంది. అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో భద్రతా ప్రమాణాలు పాటిస్తూ శిక్షణ ఇస్తున్నాం. కార్మికులు తమ పిల్లలను ఈ వేసవిలో ఈత నేర్చుకోవడానికి ప్రోత్సహించాలి. కార్మికులు కేవలం విధుల్లోనే కాకుండా, తమ ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధ వహించాలి. ఆరోగ్యకరమైన సమాజం కోసం వ్యాయామం అలవాటు చేసుకోవాలి. ముఖ్యంగా పిల్లలు ఈత నేర్చుకునేటప్పుడు తల్లిదండ్రులు దగ్గరుండి పర్యవేక్షించాలి.

### వేసవి తాపానికి ఈతతో చెక్.. ఆరోగ్యానికి ఇది అత్యుత్తమ వ్యాయామం

**- డాక్టర్ పి.రమేష్ బాబు, డిప్యూటీ సీఎంఓ**



శారీరక ధృడత్వానికి ఈతను మించిన వ్యాయామం మరొకటి లేదు. వేసవిలో శరీర ఉష్ణోగ్రతను సమతుల్యంగా ఉంచడంలో ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే, జలుబు, దగ్గు ఉన్నవారు ఈతకు దూరంగా ఉండాలి. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. ప్రమాదవశాత్తు ఎవరైనా నీటిలో చిక్కుకుంటే తాడు లేదా కర్ర సహాయంతో కాపాడాలని, నీటిలో ఎవరైనా ప్రమాదానికి గురైతే ఎలా కాపాడాలో, సీపీఆర్ ఎలా చేయాలో కూడా అవగాహన కలిగి ఉండటం మంచిది.

### ఈత ఒక ప్రాణ రక్షణ విద్య


**- గుడ్ల బాలకృష్ణ, స్విమ్మింగ్ కోచ్**



గత 16 ఏళ్లుగా నేను ఇక్కడ కోచ్‌గా పనిచేస్తున్నాను. ఈత అనేది కేవలం ఒక క్రీడ మాత్రమే కాదు, అది ఒక ఆపద్ధర్మ విద్య. ఆపదలో ఉన్నప్పుడు మన ప్రాణాలు కాపాడుకోవడంతో పాటు ఇతరులను రక్షించడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇక్కడ శిక్షణ పొందిన ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు వెళ్లడం మాకు గర్వకారణం. ప్రతి ఒక్కరూ ఈత నేర్చుకోవాలి, అది ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. కొత్తగా వచ్చే వారికి ప్రాథమిక మెళకువలతో పాటు భద్రతా నియమాలను ప్రత్యేకంగా వివరిస్తున్నాం.

### స్విమ్మింగ్ వల్ల మంచి ఫిట్‌నెస్ లభించింది

**- క్యాతం అశ్వథ్, 9వ తరగతి విద్యార్థి**



నేను నాలుగేళ్లుగా ఇక్కడ ఈత నేర్చుకుంటున్నాను. గతంలో కంటే ఇప్పుడు నాలో శారీరక ధృడత్వం పెరిగింది. బరువు తగ్గడంతో పాటు చదువుపై కూడా ఏకాగ్రత పెరిగింది. కోచ్ బాలకృష్ణ ప్రతి మెళకువను ఎంతో ఓపికగా నేర్పిస్తారు. ఇంత తక్కువ ఖర్చుతో మాకు ఇలాంటి గొప్ప అవకాశం కల్పించిన సింగరేణి యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు.



